సాక్షి
వనపర్తి
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



శ్రీనివాసా.. ఇదేమి గోస!
జంగంరెడ్డిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటుంది.
వివరాలు 8లో ▸



తొలగిన ఆటంకం
జడ్చర్లలో రైల్వే విద్యుత్ స్తంభాల తొలగింపుతో రహదారి విస్తరణ పనులకు ఆటంకం తొలగింది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.3/16.9
రోజురోజుకు చలి తీవ్రత తగ్గుతుంది.
మధ్యాహ్నం ఎండ ప్రభావం పెరుగుతుంది.
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

రెండోవిడత ప్రయోగ పరీక్షలు ప్రారంభం



వనపర్తి విద్యావిభాగం: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ రెండోవిడత ప్రయోగ పరీక్షలు శనివారం ప్రారంభమైనట్లు డీఐఈఓ ఎర్ర అంజయ్య తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రావుస్, స్కాలర్స్, సీవీ రామన్, జాగృతి, త్రివేణి జూనియర్ కళాశాల, గోపాల్‌పేట మండలం బుద్దారం సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేసి రికార్డులు, మార్కుల నమోదును పరిశీలించారు. ఉదయం పరీక్షలకు 666 మంది విద్యార్థులకుగాను 640 మంది హాజరుకాగా.. 26 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం పరీక్షలకు 503 విద్యార్థులకుగాను 490 మంది హాజరుకాగా.. 13 మంది హాజరు కాలేదని వివరించారు.

ఇంటి స్థలాలు చూపే వరకు ఉద్యమం



అమరచింత: పట్టణంలోని దుంపాయికుంటలో 25 ఏళ్ల కిందట పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలకు హద్దులు చూపకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని.. స్థలాలు చూపే వరకు ఉద్యమం ఆగదని సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి ఎండీ జబ్బార్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ రహదారి పక్కన గుడిసెల పోరు లబ్ధిదారుల రిలే దీక్షలను ఆయన ప్రారంభించి దీక్షలో పాల్గొన్న వారికి పూలమాలలు వేసి మాట్లాడారు. సీపీఎం తరఫున సంపూర్ణ మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు తమ అభ్యర్థిని గెలిపిస్తే 15 రోజుల్లో సమస్యను పరిష్కరించి ఇంటి స్థలాలు చూపడమే కాకుండా ఇందిరమ్మ ఇళ్లు సైతం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వద్ద ఈ విషయాన్ని పలుమార్లు ప్రస్తావించినా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. పేదలకు న్యాయం జరగకపోతే సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని అక్కడే జీవనం సాగిస్తున్న పేదలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. సీపీఎం పార్టీ నాయకులు అజయ్, వెంకటేశ్, ఆర్ఎన్ రమేశ్, శ్యాంసుందర్, బుచ్చన్న, శ్రీను, అనంతమ్మ పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



రాజోళి: మండలంలోని పచ్చర్లలో ఆర్ఎన్ఆర్ రకం వరి విత్తనాల ద్వారా సాగు చేసిన పంటలో సమస్యలు తలెత్తుతున్నాయని, అయిజ, వెంకటాపురం దుకాణాల్లో తీసుకున్న విత్తనాలను నాటితే నారులో ఈనెలు వస్తున్నాయని రైతులు స్థానిక వ్యవసాయ అధికారి చెప్పడంతో ఆమె పైఅధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో శనివారం హైదరాబాద్ రాజేంద్రనగర్ ఐఆర్ఆర్ఐ ప్రిన్సిపాల్, ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త ఎల్.కృష్ణ, ప్లాంట్ పాథాలజీ శాస్త్రవేత్త డా. టి.కిరణ్‌బాబు, పాలెం ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ పంటలను పరిశీలించారు. ఎన్ని పిలకలు వచ్చాయి, ఉష్ణోగ్రతలు ఎలా ఉన్నాయి, నీరు, భూమి స్వభావం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి మందులు వాడారు, ఏ దశలో వాడారనే వివరాలు తెలుసుకున్న అధికారులు, నారు, పంట నమూనాలను సేకరించారు. ఈ క్లస్టర్ ఇంచార్జ్ ఏఈఓ ఇబ్రహీం పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,632

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం 4,197 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి వచ్చింది. క్వింటా గరిష్టంగా రూ.6,632, కనిష్టంగా రూ.4,002 ధరలు లభించాయి. కంది క్వింటా గరిష్టంగా రూ.6,689, కనిష్టంగా రూ.5,800, మొక్కజొన్న రూ.2,307, పత్తి గరిష్టంగా రూ.6,809, కనిష్టంగా రూ.6,129, పెబ్బర్లు గరిష్టంగా రూ.6,851, కనిష్టంగా రూ.5,569, ఆర్ఎన్ఆర్ రూ.2,259, ఆముదాలు గరిష్టంగా రూ.6,809, కనిష్టంగా రూ.5,640, జొన్నలు గరిష్టంగా రూ.2,515, కనిష్టంగా రూ.1,879 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్‌లో కందులు క్వింటాల్ గరిష్టంగా రూ.6,859, కనిష్టంగా రూ.6,709గా ధరలు లభించాయి.

సరఫరా.. సాఫీగా!



వేసవి దృష్ట్యా విద్యుత్‌శాఖ ముందస్తు చర్యలు

- రూ.14 కోట్ల వ్యయంతో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- జోరుగా సాగుతున్న పనులు

వనపర్తి టౌన్: ఏటా వేసవిలో విద్యుత్ వినియోగం పెరుగుతుండటంతో సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా, లోఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు ఆ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. జిల్లాలో రూ.14 కోట్లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పనులు చేపడుతున్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా 33, 11 కేవీ విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుపై దృష్టి సారించారు. ఈ పనులు త్వరగా పూర్తిచేసి మార్చి నుంచి వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా అందించాలని విద్యుత్‌శాఖ నిర్ణయించింది. జిల్లాలో 61 సబ్‌స్టేషన్లు, 21 వేల వివిధ రకాల ట్రాన్స్‌ఫార్మర్లు, 11 కేవీ లైన్లు 229, 33 కేవీ లైన్లు 29 వరకు ఉన్నాయి. ఈ లైన్‌లో కొత్తవాటిని అనుసంధానం చేయడంతో సరఫరా సులభం కానుంది. కొత్త సబ్‌స్టేషన్లు అవసరం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల పెంపుతో పాటు కొన్ని సబ్‌స్టేషన్లలో అదనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోడ్‌ను నియంత్రించేలా ప్రణాళికలు రూపొందించారు. దీనికితోడు అవసరమైన మార్గాల్లో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ప్రస్తుతం 25 నుంచి 160 కెపాసిటీ వరకు వివిధ రకాల ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటిలో కొన్నింటి సామర్థ్యం పెంచడం, మరికొన్ని చోట్ల అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి లోఓల్టేజీ సమస్యను అధిగమించనున్నారు. ఇందుకుగాను వివిధ స్థాయి గల 77 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమని గుర్తించగా.. ఇప్పటి వరకు 37 బిగించగా, మరో 40 ఏర్పాటు చేయాల్సి ఉంది. చిన్నమందడి, శ్రీరంగాపూర్, రాజాపేట, కడుకుంట్ల, కంచిరావుపల్లిలో ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్లలో విద్యుత్ సామర్థ్యాన్ని పెంచేందుకు, లోడ్‌ను నియంత్రించేందుకు అదనంగా ఒక్కో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించనున్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులకు ఏ మాత్రం అవకాశం ఉండదు.

డిమాండ్‌కు అనుగుణంగా..



వేసవిలో వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను మెరుగుపరుస్తున్నాం. ఇందులో భాగంగానే 11, 33 కేవీ విద్యుత్ లైన్ల ఏర్పాటు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ నెలాఖరుకు పనులన్నీ పూర్తి చేస్తాం.
– రాజశేఖరం, ట్రాన్స్‌కో ఎస్ఈ, వనపర్తి



జిల్లాకేంద్రంలోని కందకం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కొత్త లైన్ల ఏర్పాటు..

సర్కిల్ పరిధిలోని డిమాండ్‌కు తగ్గట్టుగా 11, 33 కేవీ విద్యుత్ లైన్లను పూర్తిస్థాయిలో లాగనున్నారు. అవసరమైనచోట ఇంటర్‌లింకింగ్, బైఫర్‌కేషన్ చేసేందుకు ఈ లైన్లను ప్రతిపాదించారు. ఈ పనులు నెలాఖరుకు ముగిసేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 33 కేవీ లైన్లు నాలుగు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా.. ఇప్పటి వరకు ఒకలైన్ పూర్తికాగా.. మిగతావి ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. 11 కేవీ లైన్లు 26 కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 15 పూర్తికాగా.. మరో 11 లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

‘రేషన్’ దరఖాస్తులను డిజిటలైజేషన్ చేయాలి

వనపర్తి: ప్రజాపాలన గ్రామసభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను డిజిటలైజేషన్ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లాలోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పుర కమిషనర్లతో వెబెక్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల పనుల్లో ఎంపీడీఓలు, మున్సిపల్ సిబ్బంది బిజీగా ఉన్నందున దరఖాస్తులను తహసీల్దార్లు తీసుకొని 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ యాదయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వందశాతం ఫలితాలు సాధించాలి

- రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

కొత్తకోట రూరల్: పది, ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలని రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి ఆదేశించారు. శనివారం మండలంలోని అమడబాకుల సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇంగ్లీష్‌లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతుందని.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని, ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సబ్జెక్టు పరంగా ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలన్నారు. స్కూల్ పరిసరాలు చక్కగా ఉన్నాయని కొనియాడారు. గతేడాది కంటే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు.



అమడబాకుల మోడల్ స్కూల్‌లో అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

సబ్జెక్టుల వారీగా సాధన..

కొత్తకోట: వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతోందని.. ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులు రోజు తెల్లవారుజామునే నిద్ర లేచి సబ్జెక్టుల వారీగా సాధన చేయాలని రాష్ట్ర మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి సూచించారు. శనివారం పెబ్బేర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి కళాశాలలో కొనసాగుతున్న ప్రయోగ పరీక్షలు, రికార్డులు పరిశీలించడంతో పాటు ఇంగ్లీష్ ల్యాబ్‌ను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. పది, ఇంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని.. ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. మోడల్ స్కూల్‌లో ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడానికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఏఎంఓ రవికుమార్, మండల విద్యాధికారి జయరాములు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డా. తూర్పింటి నరేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు మంత్రి జూపల్లి రాక

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం రానున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి రాక సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని పేర్కొన్నారు.

‘రేపటి మహాధర్నాను జయప్రదం చేయండి’



మాట్లాడుతున్న ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పుట్టా ఆంజనేయులు

వనపర్తి రూరల్: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించే మహా ధర్నాకు కార్మికులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పుట్టా ఆంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లాకేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మేకల ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ పేద ప్రజలకు వ్యతిరేకంగా, బడాబాబులకు అనుకూలంగా ఉందన్నారు. పంటల గిట్టుబాటు ధరలకు చేసే ఎంఎస్‌పీ చట్టం తెచ్చేది లేదని, అందుకు అవసరమైన నిధులు కేటాయించబోమని బడ్జెట్‌లో స్పష్టం చేశారని తెలిపారు. బొగ్గు బ్లాకులకు వేలం నిర్వహిస్తూ సంస్థలను దివాళా తీయించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మండ్ల రాజు, పరమేశ్వరాచారి, లక్ష్మి, సాయిలీల, ఉమా, మహేశ్, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం జరిగిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 20 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా.. ఉమ్మడి పాలమూరు నుంచి 5,016 మంది విద్యార్థులకుగాను 4,161 మంది హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగాయని జిల్లా ఇన్‌చార్జ్ భాస్కర్‌కుమార్ తెలిపారు. 9, 11 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.



సకాలంలో టీకాల పంపిణీ జరగాలి



ఖిల్లాఘనపురం: గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ సకాలంలో జరగాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. పరిమళ అన్నారు. శనివారం ఆమె మండలంలోని రోడ్డుమీదితండా, అప్పారెడ్డిపల్లిలో పర్యటించారు. ఆశా కార్యకర్తలతో కలిసి ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్న ఇళ్లకు వెళ్లి టీకాల పంపిణీపై ఆరా తీశారు. ఏఎన్ఎంలు పోలియో, హెపటైటిస్, రోటో వైరస్ తదితర టీకాలు ఇచ్చారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు సరైన సమయంలో సక్రమంగా ఇవ్వడంతో రోగాల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు టీకాలు వేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ నెల 10న జరగాల్సిన జాతీయ నులిపురుగు నివారణ దినం వాయిదా పడిందని.. ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని చెప్పారు. ఆమె వెంట ఎంపీహెచ్ఈఓలు చంద్రయ్య, నర్సింహులు, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

గజవాహనంపై ఊరేగిన వేంకటేశ్వరస్వామి



మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పూలతో శోభాయమానంగా అలంకరించిన స్వామివారిని గజ వాహనంపై గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం స్వామివారిని గర్భగుడిలోకి తీసుకెళ్లి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు. – మహబూబ్‌నగర్ రూరల్

గుండెపోటా.. వైద్యులు లేరు!

‘ఇటీవల ఓ జిల్లా స్థాయి అధికారి గుండెపోటు బారినపడ్డారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించాక మళ్లీ హైదరాబాద్ రెఫర్ చేసి పంపారు. మరో ఘటనలో 35 ఏళ్ల యువకుడికి గుండెపోటు రాగా కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లినా ఆదివారం వైద్యులు లేరని చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో హైదరాబాద్ తరలించాల్సి వచ్చింది. ఫలితంగా గుండెపోటు బారినపడి జనరల్ ఆస్పత్రికి వచ్చిన బాధితులు ప్రాథమిక చికిత్స తర్వాత హైదరాబాద్‌కు తరలించే క్రమంలో మృతి చెందిన ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. ఇటీవల విధుల్లో ఉన్న ఓ ఏఆర్ కానిస్టేబుల్‌కు సడెన్‌గా గుండెపోటు రావడంతో చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తీసుకువచ్చిన కార్డియాలజీ విభాగం లేకపోవడంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనే ఇందుకు ఉదాహరణ.

- జనరల్ ఆస్పత్రిలో అందుబాటులోకి రాని కార్డియాలజీ సేవలు
- ప్రైవేట్ వైద్యులతో ఓపీ సేవలు అందించాలని కలెక్టర్ సూచించినా అమలులోకి రాని వైనం
- ప్రైవేట్‌లోనూ అందుబాటులో లేని కార్డియో థొరాసిక్ విభాగం
- గుండె సమస్యలు అంటేనే హైదరాబాద్‌కు సిఫారస్
- అత్యవసర వేళలో ప్రాణాలు కోల్పోతున్న బాధితులు



పాలమూరు: ఇటీవల జిల్లాలో గుండెపోటు బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే పాలమూరు ప్రజలకు గుండెపోటు వస్తే అంతే సంగతులు అనే విధంగా మారాయి పరిస్థితులు. ఇటు ప్రభుత్వ ఆస్పత్రి.. అటు ప్రైవేట్‌లోనూ సరైన వైద్య నిపుణులు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర చికిత్స కోసం హైదరాబాద్‌కు పరుగులు పెట్టాల్సి వస్తోంది. దీంతో రూ.లక్షల్లో వైద్య ఖర్చులు భరించలేక బాధితులు అవస్థలు పడుతుండగా.. మరికొందరు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో గుండె సంబంధిత సమస్యలు, గుండెపోటుతో వచ్చే బాధితులకు కనీసం ప్రాథమికంగా చేసే చికిత్స సైతం అందుబాటులో లేకుండాపోయింది. జనరల్ ఆస్పత్రిలో 2డీ ఎకో మిషన్ అందుబాటులో ఉన్నా టెక్నీషియన్ లేక వాడటం లేదు. ఇక ఈసీజీ అందుబాటులో ఉన్న రిపోర్ట్ సక్రమంగా వస్తుందా.. రాదా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేట్‌లోనూ అంతే..

పాలమూరు పట్టణంలో ప్రైవేట్ సెక్టార్‌లో నాలుగు క్యాథ్ ల్యాబ్‌లు ఉండగా ఆరుగురు వరకు కార్డియాలజిస్టులు అందుబాటులో ఉన్న కార్డియోథొరాసిక్ సర్జన్‌లు ఒక్కరు కూడా లేరు. దీంతో గుండెకు సంబంధించిన ఏదైనా చిన్నపాటి సర్జరీ చేయాలన్నా హైదరాబాద్ నుంచి టీంలు రప్పించి ఇక్కడ చేస్తున్నారు. ఇందుకోసం రోగుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారు. చాలా వరకు మేజర్ సర్జరీలు ఉంటే అందరూ హైదరాబాద్‌కు వెళ్తున్నారు. స్థానికంగా ఒకటి రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో కొంత మేర సేవలు అందుబాటులో ఉన్న ఫీజులు మాత్రం భారీగా ఉంటున్నాయి. ఎంజియోగ్రాం చేయించుకోవడానికి రూ.15 వేల – 25 వేల వరకు ఖర్చు అవుతోంది. ఒకవేళ స్టంట్ వేయాల్సి వస్తే అదనంగా రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఈ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం కూడా అందుబాటులో లేకపోవడంతో నిరుపేదలు ఆర్థికంగా చాలా నష్టపోతున్నారు.

కలెక్టర్ చెప్పినా..

జనరల్ ఆస్పత్రిలో గుండెపోటు రోగులను పరీక్షించడానికి ప్రైవేట్ కార్డియాలజిస్టులను రప్పించి వారంలో నాలుగు రోజులు ఓపీ చూసేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయేందిర బోయి అధ్యక్షుడు, ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. కమిటీ సమావేశం జరిగి దాదాపు 25 రోజులు కావొస్తున్నా ఇప్పటి వరకు ఆ విధానం అమల్లోకి రాలేదు. గత బీఆర్ఎస్ హయాంలో కూడా ఇదే మాదిరిగా ప్రైవేట్ గుండె వైద్యులను తీసుకువచ్చి ఓపీ చూసేలా ఏర్పాట్లు చేసినా ఒకటి రెండు రోజులు కూడా రోగులకు అందుబాటులో ఉండలేదు. దీంతో గుండెకు సంబంధించిన సమస్య వస్తే పేదవాడు సైతం జనరల్ ఆస్పత్రి రావడం లేదు. ఇక ఆస్పత్రిలో అడ్మిట్ అయిన రోగుల్లో ఎవరికైనా గుండె సమస్య వస్తే జనరల్ మెడిసిన్ వైద్యుడితో పరీక్షిస్తున్నారు. రోగికి సమస్య తీవ్రత అధికంగా ఉంటే బయటకు రెఫర్ చేసి పంపుతున్నారు.

అందుబాటులోకి తెస్తాం..

ఐఎంఏతో సమన్వయం చేసుకుని ప్రైవేట్‌లో ఉన్న వైద్యులతో మాట్లాడటం జరిగింది. మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఓపీ చూడటానికి కసరత్తు చేస్తున్నాం. త్వరలో జనరల్ ఆస్పత్రిలో ప్రైవేట్ కార్డియాలజిస్ట్ సేవలను రోగులకు అందుబాటులోకి తీసుకొస్తాం.
– సంపత్‌కుమార్‌సింగ్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో..

పాత కలెక్టరేట్ ఆవరణలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో అయిన అన్ని విభాగాలు అందుబాటులోకి వచ్చి హైదరాబాద్‌కు పోయే బాధ తప్పుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది. కొత్తగా నిర్మించే ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగం అందుబాటులో ఉండి అందులో అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్, థొరాసిక్ సర్జరీ థియేటర్, ఇతర పరికరాలు సైతం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇక అవసరమైన గుండె వైద్య నిపుణులు, కార్డియో థొరాసిక్ సర్జన్లను నియమిస్తే తప్పా పాలమూరు వాసుల సమస్యలు తీరవు.

క్లుప్తంగా

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

రాజాపూర్(బాలానగర్): భార్యాభర్తలు గొడవపడి క్షణికావేశంలో భర్త ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన శనివారం బాలానగర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ లెనిన్‌గౌడ్ తెలిపిన వివరాలు.. బాలానగర్‌కు చెందిన కుచ్చర్‌కంటి రమేష్(32) ఆటో నడుపుతూ జీవించేవాడు. శుక్రవారం రాత్రి భార్యాభర్తలు చిన్న విషయానికి గొడవపడ్డారు. శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి నందారం శివారులో నారాయణరెడ్డి పొలంలో చింతచెట్టుకు రమేష్ ఉరేసుకున్నాడు. ఉదయం పొలంవద్దకు వెళ్లిన నారాయణరెడ్డి కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి తమ్ముడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: గుర్తు తెలియని మహిళ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని దివిటిపల్లి సమీపంలో గుర్తు తెలియని మహిళ(35) శనివారం రాత్రి వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని.. మృతదేహాన్ని జిల్లా మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: లారీ టైర్ల కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్‌లో శుక్రవారం రాత్రి 10గంటల ప్రాంతంలో సిమెంట్ ట్యాంకర్ లారీ కోస్గి వైపు నుంచి క్లాక్‌టవర్ వైపు వెళ్తున్న క్రమంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి(40)ని ఢీకొట్టింది. టైర్ల కిందపడటంతో తల ఛిద్రమై అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు ఈత చెట్టు పైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన పుర పరిధిలోని నాగనూలులో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ (58) తన వ్యవసాయ పొలంలోని ఈతచెట్టుపైకి ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరిగి నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పాము కాటుతో వృద్ధురాలు..


నరసమ్మ (ఫైల్)

ధన్వాడ: మండల కేంద్రంలోని బీసీకాలనీకి చెందిన చెట్టుకింది నరసమ్మ (58) కుమార్తెను చూసేందుకు హైదరాబాద్‌కు వెళ్లింది. శుక్రవారం రాత్రి అక్కడ నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని శనివారం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

గుంతలో పడి 60 గొర్రెలు మృతి



వెల్దండ: మండలంలోని అజిలాపూర్ సమీపంలో రోడ్డు పక్కనున్న గోతిలో పడి 60 గొర్రెలు మృతిచెందాయి. స్థానికుల వివరాల మేరకు.. గోపాల్‌పేట మండలానికి చెందిన శ్రీరాములుతో పాటు మరికొందరు 500 గొర్రెల మందను మేత కోసం తీసుకువచ్చారు. గొర్రెల మందను అజిలాపూర్ నుంచి రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలానికి తీసుకెళ్లే క్రమంలో రోడ్డు పక్కనున్న పెద్దగోతిలో ఒకదాని తర్వాత ఒకటి పడ్డాయి. ఈ ఘటనలో 60 గొర్రెలు మృతి చెందాయని కాపరులు తెలిపారు. దాదాపు రూ. 7లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని వాపోయారు. బాధిత గొర్రెల కాపరులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని స్థానికులు కోరారు.

శ్రీనివాసా.. ఇదేమి గోస!


జంగంరెడ్డిపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం

- అభివృద్ధికి నోచుకోని జంగంరెడ్డిపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం
- రూ. కోట్ల భూములు ఉన్నా ఫలితం శూన్యం
- ఏళ్ల తరబడి శిథిలావస్థలో దేవాలయం


ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు

గండేడ్: మండలంలో భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న జంగంరెడ్డిపల్లి లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయానికి రూ.కోట్ల విలువైన భూములు ఉన్నప్పటికీ.. అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. ఏళ్ల తరబడి శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతోంది. ఏటా ఉత్సవాలను నామమాత్రంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. జాజు పట్టీలతో మాత్రమే సరిపెడుతున్నారు. ఎలాంటి వనరులు లేని ఎన్నో దేవాలయాలు ఏదో రకంగా అభివృద్ధి చెందుతుండగా.. జంగంరెడ్డిపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం మాత్రం ఆదరణకు నోచుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఆలయ చరిత్ర..

జంగంరెడ్డిపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ఘన చరిత్ర ఉంది. గ్రామానికి చెందిన వెంకన్న అనే భక్తుడు ప్రతి సంవత్సరం తిరుమల తిరుపతి దేవస్థానానికి పాదయాత్ర చేసే వాడు. చరమాంక దశలో అతడు తిరుపతికి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆయన కోసం స్వామి వారు ఇక్కడ వెలసినట్లు పెద్దలు చెబుతారు. పండగల రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ప్రతి ఏడాది మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

కౌలు డబ్బు ఉత్సవాలకే..

దేవాలయం భూముల్లో ఏళ్ల తరబడి కొందరే కాస్తులో ఉంటున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు కౌలు ధరను పక్కాగా నిర్ణయించకపోవడంతో రూ. 100 నుంచి రూ. 200 మాత్రమే చెల్లిస్తూ వచ్చారు. కొందరు కౌలు చెల్లించని సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం తరి భూములకు ఎకరా రూ.2,500, మెట్టకు రూ.1,500 వసూలు చేస్తున్నారు. దీంతో ఉత్సవాల నిర్వహణకు నిధులు సరిపోక విరాళాలు సేకరించాల్సిన పరిస్థితి నెలకొంది. సంవత్సరం పాటు ఆలయ నిర్వహణకు కూడా కష్టంగా మారింది. కౌలు పెంచకుండా రాజకీయ రంగప్రవేశం చేయడంతో ఆలయ అభివృద్ధికి అవరోధంగా మారుతోంది. కాగా, కౌలు వసూలు చేయడం తప్ప లెక్కలు కూడా లేవు.

మరమ్మతులు కరువు..

జంగంరెడ్డిపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని వందేళ్ల క్రితం రాతితో నిర్మించారు. చిన్నచిన్న రాళ్లతో నిర్మించిన ప్రహరీ శిథిలావస్థలో ఉంది. ధ్వజస్తంభం కూడా కూలిపోయే దశలో ఉంది. ఏటా సున్నంవేసి, జాజు పట్టీలు పెట్టి ఉత్సవాలు కొనసాగించడం తప్ప.. మరమ్మతులు గాని ఇతర అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులు రాత్రివేళలో ఉండటానికి వసతి కూడా లేదు. వర్షం వస్తే ఆలయం లోపల తలదాచుకోడానికి ఏ వసతి లేదు. ఆలయానికి వందెకరాలకు పైగా భూమి ఉండటంతో ఇతరత్రా నిధుల కేటాయింపు కూడా జరగడం లేదు. భక్తులకు నీటి వసతి, మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. తేరు ఉంచేందుకు షెడ్డు లేకపోవడంతో బయటే ఉంచుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని భక్తులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



నా చిన్నతనం నుంచి చూస్తున్నా ఏమార్పు లేదు. ఉదయం, సాయంత్రం పూజలు చేయడం, జాతర సమయంలో ఉత్సవాలు నిర్వహించడం తప్ప దేవాలయం అభివృద్ధి మాత్రం జరగడం లేదు. కౌలు ఎంత వస్తుంది? ఎంత ఖర్చువుతుంది? మిగులు ఏమైనా ఉందా? అనే లెక్కలు ఏళ్ల తరబడి లేవు. ఆలయ అభివృద్ధిని పట్టించుకునే నాథుడు లేడు. ఆలయ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలి.

– కోస్గి తిరుపతయ్య, జంగంరెడ్డిపల్లి

ప్రతిపాదనలు పంపుతాం..

ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపుతాం. దాదాపు రూ. 2కోట్ల నుంచి రూ. 3కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మించాలని యోచిస్తున్నాం. ఇందుకు గాను దేవాదాయశాఖకు ప్రతిపాదనలు పంపుతాం. దీంతో పాటు టీటీడీకి కూడా ప్రతిపాదనలు పంపిస్తాం. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ప్రతి రెండేళ్లకోసారి కౌలు పెంచుతున్నాం. ఇప్పుడు వస్తున్న కౌలు ఉత్సవాలు, ఆలయ నిర్వహణకు మాత్రమే సరిపోతుంది. అందరూ సహకరిస్తే ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం.

– ప్రసాద్, దేవాదాయశాఖ అధికారి

విలువైన భూములు ఉన్నా..

మండలంలో రెండు ఆలయాలకు మాత్రమే భూములు ఉన్నాయి. అందులో మన్సూర్‌పల్లి ఆంజనేయస్వామి దేవాలయానికి 52 ఎకరాల భూమి ఉండగా.. జంగంరెడ్డిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి 165 ఎకరాల భూమి ఉంది. జంగంరెడ్డిపల్లి దేవుని చెరువు, గండేడ్ ద్యావల్ చెరువు, రెడ్డిపల్లి రెడ్డి చెరువు కింద గండేడ్, రెడ్డిపల్లి, అంచన్‌పల్లి గ్రామాల్లో ఈ ఆలయ భూములు ఉన్నాయి.


వేంకటేశ్వరస్వామి ఆలయ భూములు

'లైసెన్స్' లేని డ్రైవర్లు

ఇష్టారీతిగా వాహనాలు నడుపుతున్న మైనర్లు

వారి వయస్సు చిన్నదే.. కానీ, స్పీడు మాత్రం అంతకు పదింతలు ఉంటుంది. అది కారా.. లేక బైకా.. ఇతర వాహనం ఏది అనేది ఏమాత్రం చూడరు. బండి చేతికి వచ్చిందే ఆలస్యం.. ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, మితిమీరిన వేగం.. ఇలా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతూ.. ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ క్రమంలో ఎందరో అమాయకులు ప్రాణాలు కోల్పోతుండగా.. మరెందరో అవిటివారుగా మారుతున్నారు. ఇలా ఎన్నో సంఘటనలు చోటుచేసుకుంటున్నా తల్లిదండ్రులు మాత్రం వారికి అలాగే వాహనాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు.

- గ్రామీణ ప్రాంతాల్లోనూ ర్యాష్ డ్రైవింగ్‌తో హల్‌చల్
- ప్రోత్సహిస్తున్న కొందరు తల్లిదండ్రులు
- నామమాత్రంగా అవగాహన కార్యక్రమాలు
- జరిమానాలు విధిస్తున్నా అడ్డుకట్ట పడని వైనం



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో ఎంతో మంది మైనర్లు యథేచ్ఛగా వాహనాలతో దూసుకుపోతూ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై కనీస అవగాహన లేకపోయినా వాహనాలు నడుపుతూ.. ఇతరులను ప్రమాదాల బారిన పడేస్తుండటంతోపాటు కొన్ని సందర్భాల్లో మైనర్లు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ, మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వాహనాలు నడిపే మైనర్లపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

భారీ వాహనాలు సైతం..

మైనర్లు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతుండటంతో భయాందోళనలు నెలకొన్నాయి. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కేవలం పట్టణ ప్రాంతాల్లో మాత్రమే తనిఖీలు నిర్వహిస్తూ.. వాహనాలను నడుపుతున్న మైనర్లను పట్టుకుని జరిమానాలు విధిస్తున్నారే తప్ప.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టిసారించకపోవడంతో ఆటోలు, జీపులు, కార్లు, ట్రాక్టర్లు వంటి పెద్ద వాహనాలను సైతం నడుపుతున్నారు. కాగా కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మైనర్లు వాహనాలు నడిపితే జరిగే పరిణామాలపై అవగాహన కల్పించినప్పటికీ వారిలో మార్పు రావడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు మేజర్లు కాకముందే వాహనాలను దగ్గరుండి మరీ నడిపిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. మరికొందరు తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకున్నప్పటికీ పెద్దలకు తెలియకుండానే వాహనాలు నడుపుతూ.. ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు.

- విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలలు, కళాశాలలకు వాహనాలు నడుపుకొంటూ వస్తున్నప్పటికీ జిల్లాలోని పాఠశాలల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో యాజమాన్యాలు విద్యార్థులపై ప్రత్యేక నిఘా ఉన్నప్పటికీ పాఠశాలలు, కళాశాలలకు దూరంగా వాహనాలను పార్కింగ్ చేసి మరీ వస్తున్నారు. మైనర్లపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారిస్తేనే ఈ చర్యలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.
- ప్రతిరోజు ఎంతో మంది మైనర్లు, లైసెన్స్ లేని వారు ఇష్టారీతిగా వాహనాలు నడుపుతూ కనిపిస్తారు. కానీ, మోటారు వాహన చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మైనర్ల పట్ల పోలీసులు అడపాదడపా కఠినంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది వాహనాలు నడిపిన 54 మంది మైనర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు రూ.27 వేల జరిమానా విధించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 2 కేసులు నమోదు చేసి రూ.2 వేలు జరిమానా విధించడం గమనార్హం.

అవగాహన కల్పిస్తున్నాం..



మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహనాలు నడిపే మైనర్లను గుర్తించడంతో పాటు తల్లిదండ్రులకు, మైనర్లకు అవగాహన కల్పిస్తున్నాం. పిల్లలు వాహనాలు నడుపుతున్నారని తల్లిదండ్రులు మురిసిపోవడం కాదు.. పిల్లల కదలికలపై నిఘా ఉంచి చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వాహనాలు నడిపే మైనర్లు, డ్రైవింగ్ లైసెన్సు లేని యువకులపై కేసులు నమోదు చేస్తున్నాం.

– గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ

'ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి చేస్తున్నాం'


కొల్లాపూర్‌లో రహదారి నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

కొల్లాపూర్/ పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ.. అభివృద్ధి విషయంలో రాజీపడటం లేదని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన కొల్లాపూర్ నుంచి చింతలపల్లి వరకు ఎంఆర్ఆర్ గ్రాంట్స్ రూ.4.95 కోట్లతో చేపట్టనున్న బీటీ రహదారి రెన్యువల్ పనులకు, కొల్లాపూర్ నుంచి అమరగిరికి రూ.3 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని రహదారులను బాగు చేస్తామన్నారు. పూర్తిగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. అలాగే పెద్దకొత్తపల్లి మండలంలోని 24 గ్రామాల్లో రూ.3.72 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.3 కోట్లతో నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం వద్ద నిర్మించనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు జూపల్లి రఘుపతి రావు, నర్సింహారావు, హన్మంతునాయక్, నాగరాజు, రాజశేఖర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, రహీం, ఎక్బాల్, నయీం, సూర్యప్రతాప్‌గౌడ్, మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసం : కేసు నమోదు

ఉప్పునుంతల: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకున్నానని శనివారం మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన శంకరయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. శంకరయ్య గతేడాది డిసెంబర్ 11న డెకథ్లాన్ యాప్‌ను స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని రూ.3.20లక్షలు పెట్టుబడి చేశారు. రోజుకు రూ.5వేల చొప్పున కొన్ని రోజులు జమచేసిన సైబర్ నేరగాళ్లు.. జనవరిలో డబ్బులివ్వకపోవడంతో పాటు యాప్‌ను మూసివేశారు. సైబర్ క్రైంకు ఫిర్యాదు చేయడంతో పాటు శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు.

కలెక్టరేట్‌లో కొండచిలువలు


కొండచిలువను ప్లాస్టిక్ డబ్బాలో బంధిస్తున్న స్నేక్ క్యాచర్

నాగర్‌కర్నూల్ క్రైం: కలెక్టరేట్‌లోని జి–8 కార్యాలయ వెనుక భాగంలోని చెట్ల పొదల్లో శనివారం రెండు కొండ చిలువలు ఉద్యోగులకు కనిపించాయి. భయాందోళనకు గురైన వారు వెంటనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి సుమారు ఆరు అడుగుల పొడవున్న కొండ చిలువలను పట్టుకొని ప్లాస్టిక్ డబ్బాల్లో బంధించి సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలారు. దీంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

వరిలో కాండం తొలుచు పురుగు


కాండం తొలుచు పురుగు ఆశించిన వరి పంట



పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వరిలో నారు నుంచి పైరు పాలు పోసుకోనే దశ వరకు కాండం తొలిచే పురుగు ఆశిస్తుంది. ఇది సోకిన ప్రాథమిక దశ నుంచే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ రైతులకు సూచించారు. దీనినే మొవ్వ పురుగు అంటారని, ఈ పురుగు ఆశిస్తే తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

పురుగు జీవిత చక్రం

తల్లి పురుగు కనీసం 300 గుడ్ల వరకు పెడుతుంది. ఒక్కొక్క గుంపులో 20 నుంచి 80 గుడ్లు ఉంటాయి. ఈ గుడ్లు 5 నుంచి 7 రోజులు పొదిగి పురుగులు బయటికి వస్తాయి. లార్వా దశ పూర్తికాలం 30 నుంచి 40 రోజులు ఉంటుంది. పూర్తి జీవిత చక్రం 70 రోజుల్లో పూర్తవుతుంది.

నష్టపరిచే విధానం ఇలా..

చిరు పొట్ట ఏర్పడిన తర్వాత పురుగు ఆశిస్తే వెన్నులో నుంచి గింజలకు పోషకాలు అందక అవి తాలుగా మారుతాయి.

- తల్లి రెక్కల పురుగు గుడ్లను ఆకు చివరిపై భాగంలో గుంపులుగా పెట్టి ఉదరం చివర గల వెంట్రుకలతో కప్పి ఉంచుతుంది.
- ఈ పురుగులు గుంపులుగా మొక్క పైభాగంలో చేరి ఆకు తొడిమపై ఉన్న పత్రహరితాన్ని గోకి తింటాయి.
- పూర్తిగా ఎదిగిన పురుగు వరి కాండంలో కోశస్థ దశకు చేరుకుంటాయి.
- పైరు పిలకలు వేసే దశలో గుడ్ల నుంచి వెలువడిన వెంటనే మొదటి దశ పిల్ల పురుగులు ఆకు కొమ్మకు చేరుకొని అక్కడ పత్రహరితాన్ని గోకి తింటాయి.
- పంటల్లో ఈ పురుగు చేసే నష్టం వలన మొక్క ఆకులు తెల్లని చారలుగా ఏర్పడతాయి.
- ఈ పురుగు కాండం లోపలికి చేరి కణజాలాన్ని తినడం వలన మువ్వ ఆకులు విడిపడక మువ్వ కోళ్లు ఏర్పడుతుంది.

నారు మడి నుంచే జాగ్రత్తలు

నారు తీయడానికి వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటు నారుమడికి 170 గ్రాములు చొప్పున నీటిలో ఇసుక కలిపి నారుమడిలో చల్లుకోవాలి. నారు నాటేటప్పుడు నారు చివర్లు తుంచి వేయాలి.

నివారణ చర్యలు

వరి పిలకలు తొడిగే దశలో లీటరు నీటికి 2 మి.లీ., క్లోరోఫైరిపాస్ కలిపి పిచికారీ చేసుకోవాలి. అంకురం దశలో 10 నుంచి 15 రోజుల సమయంలో ఎకరానికి 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు చల్లుకోవాలి. పురుగు మందులైతే క్లోరో ఫైరిపాస్ 2 మి.మీ., అసిఫేట్ 1.5 గ్రాములు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

రేషన్ బియ్యం పట్టివేత



నారాయణపేట: జిల్లా కేంద్రంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. అప్పిరెడ్డిపల్లికి చెందిన అనంతయ్య అనే వ్యక్తి ఇతరుల నుంచి రేషన్ బియ్యం సేకరించి.. స్థానిక సుభాష్ రోడ్డులోని రేకుల షెడ్డులో నిల్వ చేస్తుండగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. 20 బస్తాల్లోని 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీటీ కాలప్ప పంచనామా అనంతరం అనంతయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ అంజిలయ్య తెలిపారు.

సోమశిలలో ఆదివాసీ గిరిజన శిక్షణ తరగతులు



కొల్లాపూర్: మండలంలోని సోమశిలలో ఈ నెల 12 నుంచి 14 వరకు ఏఐసీసీ ఆదివాసీ గిరిజన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంఘం జాతీయ నాయకులు రాహుల్‌బాల, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ తెలిపారు. శనివారం వారు సోమశిలలో పర్యటించి.. శిక్షణ తరగతుల నిర్వహణకు సంబంధించిన వసతులను పరిశీలించారు. ఏర్పాట్ల గురించి స్థానిక గిరిజన నేతలతో చర్చించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి 400 మందికిపైగా గిరిజనులు శిక్షణ తరగతులకు హాజరవుతారని వివరించారు. వివిధ అంశాలపై ప్రసంగించేందుకు గిరిజన ప్రొఫెసర్లు, సైకాలజిస్టులు, గిరిజన ఎమ్మెల్యేలు వస్తారని చెప్పారు. అనంతరం రాహుల్‌బాల, బెల్లయ్యనాయక్‌లను కొల్లాపూర్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హన్మంతునాయక్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కోటియానాయక్, లింగన్ననాయక్, శివ, గణేష్, గోపి, చిన్ని కృష్ణ, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థుడి జీవితం ఆదర్శనీయం

• కొనియాడిన దక్షిణాసియా బౌద్ధ భిక్షువులు



బుద్ధవనంలోని ధర్మగంట వద్ద బౌద్ధులు

నాగార్జునసాగర్: సిద్ధార్థుడి (బుద్ధుడి) జీవితం ఆదర్శనీయమని దక్షిణాసియా బౌద్ధ భిక్షువులు కొనియాడారు. నాగార్జునసాగర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ త్రిపీటక పఠనోత్సవంలో పాల్గొన్న బౌద్ధ భిక్షువులు శనివారం బుద్ధవనంలో ఆచార్య నాగార్జునుడి శిల్పం, బుద్ధుడి పాదుకలు, బుద్ధ చరితవనం, శ్రీలంక బహూకరించిన అవుకన బుద్ధుడి శిల్పం, స్థూపవనంలోని 14 నమూనా స్థూపాలను సందర్శించారు. బుద్ధవనం కన్సల్టెంట్, చరిత్ర పరిశోధకుడు, బౌద్ధనిపుణుడు శివనాగిరెడ్డి వారికి బుద్ధవనంలోని శిల్పాల విశేషాలను, చారిత్రక ప్రాధాన్యాలను వివరించారు. శ్రీలంక ప్రభుత్వం బహూకరించిన గంటను మోగించి బుద్ధవనం పర్యటనను ముగించారు. అక్కడినుంచి లాంచీలో వెళ్లి నాగార్జునకొండను సందర్శించారు. అక్కడి కట్టడాలు, శిల్పాలను ఆసక్తిగా వీక్షించారు. బౌద్ధ ప్రదర్శనశాల విశేషాలను మ్యూజియం అధికారి కమలేహాసన్ వివరించారు. కార్యక్రమంలో మహాబోధి బుద్ధవిహార అధ్యక్షుడు కశ్యపబంతే, ఆనంద బంతే, సంఘపాల బంతే, శ్రీలంక మయన్మార్, లావోస్, కంబోడియా, వియత్నాం, థాయ్‌లాండ్ దేశాల బౌద్ధ భిక్షువులు అంతర్జాతీయ త్రిపీటక పఠన మండలి వ్యవస్థాపకురాలు వాంగ్మేదీక్షి(అమెరికా), సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజే 268 మంది మందుబాబులు చిక్కారు!

సాక్షి, హైదరాబాద్: సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మందుబాబుల మత్తు వదిలిస్తున్నారు. ఈ నెల 7న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ (డీడీ) తనిఖీల్లో 268 మంది పట్టుబడ్డారు. వీరిలో 223 మంది ద్విచక్ర వాహనదారులు కాగా.. 10 మంది త్రీ వీలర్స్, 33 మంది ఫోర్ వీలర్స్, ఇద్దరు ట్రక్ డ్రైవర్లు ఉన్నారు. ఆయా వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. పట్టుబడిన వారిలో 35 మంది మత్తుబాబుల బీఏసీ మోతాదు 200 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్‌గా నమోదయింది. మద్యం మత్తులో వాహనాలను నడిపే వారిపై బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేశారు.



పొట్టచేత 'బట్టి'..

జానెడు పొట్ట కోసం ఇటుక బట్టీల్లో మహిళా కార్మికులు మోయలేని భారంతో పనులు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా బ్రిక్స్ వ్యాపారానికి ప్రసిద్ధి. జిల్లా వ్యాప్తంగా 90 వరకు ఉన్న ఇటుక బట్టీల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మంది వలస కూలీలు ఉపాధి పొందుతున్నారు. పెద్దపల్లి శివారులో మహిళలు తలపై ఇటుకలు మోస్తూ ఇలా కనిపించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ఎటుచూసినా ఎర్ర బంగారం

మహబూబాబాద్ జిల్లా మిర్చి అంటే జాతీయ స్థాయిలో మంచి గిరాకీ ఉంది. అలాంటిది.. మిర్చి ధరలు సగానికి సగం పడిపోవడంతో.. మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలం చింతపల్లి, పెద్ద లాలు తండా, చిన్న లాలు తండా గ్రామాల పైనుండి వెళ్తున్న జాతీయ రహదారి-365 పై.. రైతులు కిలోమీటర్ల మేర మిర్చిని ఎండబోసారు. మధ్యాహ్న సమయంలో మిర్చిని ఎండబెట్టి.. సాయంత్రం కాగానే వాటిని కుప్పలు చేసి టార్పాలిన్లు కప్పి ఉంచుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

చొరబాటు ప్రయాణం!

మయన్మార్ టు ఇండియా వయా బంగ్లాదేశ్

• నగరానికి రోహింగ్యాల రాక సాగుతోందిలా..
• అత్యధికంగా పాతబస్తీలో స్థిరపడుతున్న వైనం
• మీ సేవ సెంటర్ల నిర్వాహకులతో గుర్తింపు పత్రాలు
• కోల్‌కతాలో చిక్కినవారి విచారణలో వెలుగులోకి
• బంగ్లా పరిణామాల నేపథ్యంలో నిఘా వర్గాల అలర్ట్

సాక్షి, హైదరాబాద్: మయన్మార్ నుంచి అక్రమ మార్గంలో భారత్‌లోకి చొరబడుతున్న రోహింగ్యాల్లో అనేక మంది నగరంలోనూ ఉంటున్నారా? అనే ప్రశ్నకు ఔననే అంటున్నాయి నిఘా వర్గాలు. వీరిలో అత్యధికులు హైదరాబాద్‌లోని పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాల్లో స్థిరపడుతున్నట్లు చెబుతున్నాయి. కోల్‌కతాలోని సాంత్రాగచ్చి రైల్వే స్టేషన్‌లో అక్కడి రైల్వే పోలీసులు బుధవారం నలుగురు రోహింగ్యాలను పట్టుకున్నారు. వీళ్లు ఏళ్ల క్రితం అక్రమంగా సరిహద్దులు దాటి వచ్చి నగరంలోని పాతబస్తీలో ఉంటున్నారని, తిరిగి బంగ్లాదేశ్ వెళ్లే ప్రయత్నాల్లో అక్కడి పోలీసులకు చిక్కారు. వీరి విచారణలో మయన్మార్ నుంచి భారత్ వరకు సాగుతున్న రోహింగ్యాల 'ప్రయాణం' వెలుగులోకి వచ్చింది.

అక్కడి అలజడులతో ఇక్కడ దడ...

బంగ్లాదేశ్‌తో పాటు మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత పరిస్థితులపై ఈ అక్రమ వలసదారుల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఆయా దేశాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తిన ప్రతిసారీ.. అనేక మంది రోహింగ్యాలు వాటిని విడిచిపెడుతున్నారు. వీరిలో అత్యధికులు నేరుగా భారత్‌కు వలస వస్తున్నారు. నగరంలోని పాతబస్తీతో పాటు శివార్లలో స్థిరపడుతున్నారు. తాజాగా మరోసారి బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు చెలరేగడంతో అక్రమ వలసలు పెరిగే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

మాంగ్డో నుంచి టెక్నాఫ్ నగరానికి..

మయన్మార్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన రోహింగ్యాలు అడవుల వెంట కాలిబాటన నడుస్తూ ఆ దేశంలోని మాంగ్డో అనే ప్రాంతానికి చేరుకుంటున్నారు. రాత్రి వేళల్లో చిన్న చిన్న పడవలపై నఫ్ నదిని దాటుతున్న రోహింగ్యాలను బంగ్లాదేశ్‌లో ఉన్న దళారులు రిసీవ్ చేసుకుని, భద్రత బలగాల కంట పడకుండా టెక్నాఫ్ అనే నగరానికి తీసుకువెళ్తున్నారు. అక్కడి నుంచి బస్సుల్లో ప్రపంచంలోనే అతిపెద్ద రోహింగ్యాల శరణార్థి శిబిరం ఉన్న కాక్స్ బజార్‌కు వీళ్లు వచ్చి చేరుతున్నారు. అక్కడ ఉండగానే అనేక మంది ఐక్యరాజ్య సమితి శరణార్థి కార్డు పొందుతున్నారు. అక్కడ శరణార్థి శిబిరంలో కొన్నాళ్లు తలదాచుకుని బంగ్లాదేశ్ రాజధాని ఢాకా చేరుకుని అక్కడి నుంచి ఇండో-బంగ్లా సరిహద్దుల్లోని భోమ్రా ప్రాంతానికి బస్సుల్లో వస్తున్నారు. భద్రతా బలగాల కళ్లుగప్పి ఇచ్ఛామతి నది దాటి భారత్‌లోకి ప్రవేశిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులుగా...

కాక్స్ టౌన్‌లో పనులు చేసుకుంటే నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకే సంపాదన ఉంటుందని, అదే హైదరాబాద్ లాంటి నగరాల్లో రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నామని సాంత్రాగచ్చిలో చిక్కిన రోహింగ్యాలు మహ్మద్ ఆలం, రియాసుల్ ఇస్లాం, బేగం దిల్‌బార్, రబీల్ ఇస్లాం పశ్చిమ బెంగాల్ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు. అందుకే నగరానికి అక్రమ వలసదారుల్లో అనేక మంది జీవనోపాధి కోసమే వస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.



సాంత్రాగచ్చిలో చిక్కిన రోహింగ్యాలతో పోలీసులు

పశ్చిమ బెంగాల్ నుంచి అనేక వైపులకు..

ఇలా రెండు దేశాల్లోని నదులు దాటి పశ్చిమ బెంగాల్‌లోని బసిర్హట్ ప్రాంతానికి చేరుకున్న ఈ శరణార్థులు అక్కడ నుంచి హౌరాకు వచ్చి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌తో పాటు బిహార్, జమ్మూ కశ్మీర్‌లకు వెళ్తున్నారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఏ ప్రాంతానికి వెళ్లినా తాము పశ్చిమ బెంగాల్ వాసులమంటూ ఇంటిని అద్దెకు తీసుకుంటున్నారు. అద్దె ఇంటి కరెంట్ బిల్లు ఆధారంగా, వ్యవస్థాగతంగా ఉన్న లోపాలను వాడుకుంటున్న వీళ్లు మీ సేవ కేంద్రాల నిర్వాహకుల సాయంతో ఓటర్ ఐడీలు పొందుతున్నారు. దీని ఆధారంగా ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ ఇలా వరుసగా గుర్తింపు కార్డులు తీసుకుంటున్నారు.

ఆధార్ లింకు ఉంటేనే ఈపీఎఫ్ ప్రోత్సాహకాలు

• ఇప్పటికే పలుమార్లు అవకాశం కల్పించినా అప్‌డేషన్ అంతంతే
• 15వ తేదీలోగా తప్పనిసరిగా లింకు చేసుకోవాలని ఈపీఎఫ్ఓ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ)లో కొత్తగా చందాదారులుగా చేరుతున్న వారికి ప్రోత్సాహకాల పంపిణీలో అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఉద్యోగులుగా కొత్తగా చేరే వారికి కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ (ఈఎల్ఐ) కింద ఒక నెల వేతనం (గరిష్ఠంగా రూ.15 వేలు) మూడు వాయిదాల్లో అందిస్తుంది. ఇది నేరుగా ఉద్యోగి బ్యాంకు ఖాతాలోకి ఈపీఎఫ్ఓ అధికారులు బదిలీ చేస్తారు. ఈ పథకానికి అర్హత సాధించాలంటే సదరు ఉద్యోగి తన పూర్తి వివరాలను సమర్పించి యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్)ను యాక్టివ్ చేసుకోవాలి. కానీ మెజార్టీ ఉద్యోగులు ఈ ప్రక్రియను పూర్తి చేయకపోవడంతో ప్రోత్సాహకాల పంపిణీ ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో ఉద్యోగంలో చేరిన మూడు నెలల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఈపీఎఫ్ఓ పలుమార్లు సూచించినప్పటికీ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ఈ క్రమంలో ఈఎల్ఐ పథకానికి అర్హత సాధించిన వారు ఈనెల 15వ తేదీలోగా యూఏఎన్ యాక్టివేషన్, బ్యాంకు ఖాతాను ఆధార్‌తో సీడింగ్ ప్రక్రియను తప్పకుండా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈమేరకు ఈపీఎఫ్ఓ ప్రధాన కార్యాలయంలోని అదనపు ప్రావిడెంట్ కమిషనర్ అనిల్ ఓకే తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

ఈడీఎల్ఐ పథకానికీ లింకు తప్పనిసరి...

ఈపీఎఫ్ఓ చందాదారులకు బీమా పథకంలో భాగంగా ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఈడీఎల్ఐ)ను అందిస్తోంది. పీఎఫ్ చందాదారుడైన ప్రతి ఉద్యోగికి ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. వివిధ కారణాలతో ఉద్యోగి మరణిస్తే గరిష్ఠంగా రూ.7 లక్షల వరకు బీమా డబ్బులు సదరు చందాదారుడి నామినీకి అందుతాయి. ఈ పథకం కింద పలు క్లెయిములు ఆధార్ సీడింగ్ లేకపోవడం, ఉద్యోగికి సంబంధించిన సరైన వివరాలు లేకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఉద్యోగి యూఏఎన్ యాక్టివేషన్ పూర్తి చేసుకోవాలని ఈపీఎఫ్ఓ సూచిస్తుంది. అదేవిధంగా ఆధార్ సీడింగ్ ప్రక్రియ సైతం అత్యవసరంగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

క్రీడాకారులకు సన్మానం



మహబూబ్‌నగర్ క్రీడలు: కేరళ రాష్ట్రం తిరువనంతపూర్‌లో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి యోగా పోటీలకు 8మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో యోగా సంఘం ప్రతినిధులు అభినందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, ఆర్.బాల్‌రాజు, సలహాదారుడు చెన్నవీరయ్య, సభ్యులు చంద్రశేఖర్, సూర్యప్రకాశ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణంలో మంటలు

మహమ్మదాబాద్: విద్యుదాఘాతంతో రేషన్ దుకాణంలో మంటలు చెలరేగిన ఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. విద్యుత్ తీగలు కాలి మంటలు చెలరేగడంతో స్థానికులు చూసి డీలర్ లక్ష్మయ్యకు సమాచారమిచ్చారు. ఆయన వెంటనే దుకాణం వద్దకు వచ్చి తాళం తీసి చూడగా మంటలు ఎగసిపడుతున్నాయి. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు. 25 క్వింటాళ్ల బియ్యం కాలిపోగా.. 150 ఖాళీ సంచులు అగ్నికి ఆహుతైనట్లు డీలర్ లక్ష్మయ్య వివరించారు.

తొలగిన 'రైల్వే' ఆటంకం



రైల్వే బ్రిడ్జి పనుల వద్ద పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త లైన్ ఏర్పాటు

• రైల్వే విద్యుత్ స్తంభాల తొలగింపు
• రాకపోకలకు వీలుగా కొత్త స్తంభాల ఏర్పాటు
• నత్తనడకన సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులు

జడ్చర్ల: సిగ్నల్‌గడ్డ వద్ద కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులకు రైల్వే శాఖ నుంచి ఆటంకం తొలగింది. రైల్వే విద్యుత్ లైన్ స్తంభాలు బ్రిడ్జి నిర్మాణానికి అడ్డంకిగా మారాయంటూ దాదాపు ఏడాదికి పైగా పనులను ఇక్కడ నిలిపేశారు. స్తంభాల తొలగింపునకు దక్షిణ మధ్య రైల్వే శాఖాధికారులు అనుమతులివ్వడంలో జాప్యం చేశారు. ఎట్టకేలకు రైల్వే అధికారులు విద్యుత్ స్తంభాలను తొలగించి పక్కనే రైళ్ల రాకపోకలకు వీలుగా పట్టాలకు అటు ఇటుగా కొత్త స్తంభాలను ఏర్పాటుచేశారు. విద్యుత్ లైన్లను సరిచేశారు. పాత స్తంభాలను సైతం కట్‌చేసి పక్కన పడేశారు. ఇక మరోసారి రైల్వే శాఖ అనుమతులతో అటు ఇటుగా ఇప్పటికే నిర్మాణం పూర్తిచేసిన బ్రిడ్జి పిల్లర్లపై స్లాబుకు సంబంధించిన స్తంభాలను ఏర్పాటుచేయాల్సి ఉంది. సింగిల్ లైన్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి రాకపోకలకు వీలు కల్పిస్తే రెండో వైపు ఆలస్యం జరిగినా పెద్దగా ఇబ్బందులు ఉండవని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేసి రాకపోకలకు వీలు కల్పిస్తారా.. కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేస్తారా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



నత్తనడకన సాగుతున్న సిగ్నల్‌గడ్డ రోడ్డు పనులు

నాసిరకంగా రోడ్డు పనులు

సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. చేపట్టిన పనులు సైతం నాసిరకంగా ఉన్నాయి. కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలిచ్చి పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల దృష్టి సారించి పనులు నాణ్యతగా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వేసవిలోగా పూర్తికాకపోతే కష్టమే

వేసవికాలం ముగిసేలోపు రోడ్డు విస్తరణ పనులు పూర్తికాకపోతే మరోఏడాది పాటు కొనసాగే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వర్షా కాలం ప్రారంభం అయితే పనులు ముందుకు సాగే పరిస్థితి ఉండదు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. పనులను త్వరితగతిన పూర్తయ్యే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పోలీసులు క్రీడల్లో రాణించాలి

ఎర్రవల్లి: పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటుగా క్రీడల్లో ప్రతిభను చాటాలని పదో పటాలం కమాండెంట్ సాంబయ్య అన్నారు. రాష్ట్రస్థాయి పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2025లో బెటాలియన్ సిబ్బంది పలు పతకాలను సాధించినందుకుగాను శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలో విజయ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభను కనబర్చి ఐదు గోల్డ్, నాలుగు సిల్వర్, ఏడు బ్రౌంజ్ మెడల్స్ సాధించిన 16మంది సిబ్బందికి ఎర్రవల్లి కూడలిలో బెటాలియన్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమానికి కమాండెంట్ హాజరై మాట్లాడారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటుగా శరీరం దృఢత్వంగా ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో సిబ్బంది పలు పతకాలను సాధించి బెటాలియన్‌కు మంచి పేరు తీసుకువచ్చారని, భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించిన సిబ్బంది ప్రతిభ చాటాలని సూచించారు. అనంతరం మెడల్స్ సాదించిన సిబ్బందిని అడిషనల్ కమాండెంట్ జయరాజుతో కలిసి అభినందించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆర్ఐలు ఆర్.పి సింగ్, వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, తదితరులు ఉన్నారు.



మెడల్స్ సాధించిన సిబ్బందిని అభినందిస్తున్న బీచుపల్లి బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య

అసలేం జరిగింది?

యువకుడు అనుమానాస్పద మృతి కేసులో విచారణ

• ట్రాన్స్‌జెండర్ పల్లవిని పెళ్లాడిన నవీన్
• తాళికట్టిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్
• ఆసక్తికర విషయాలు వెలుగులోకి..

గద్వాల క్రైం: ఈనెల 4వ తేదీ రాత్రి అసలు ఏం జరిగింది అన్న కోణంలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. అసలు నవీన్‌ది బలవన్మరణమా.. లేక చిత్రహింసలకు గురిచేయడంతో మరణించాడా అన్న దానిపై శనివారం గద్వాల పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ఈక్రమంలోనే నవీన్ ట్రాన్స్‌జెండర్ పల్లవిని రహస్యంగా ఆమె ఇంట్లోనే తాళి కట్టిన వీడియోలు సైతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మృతుడు నవీన్‌కు 4వ తేదీ రాత్రి కడుపునొప్పి రాగా చికిత్సకోసం పల్లవి తమ్ముడు నరేష్ గద్వాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు ట్రాన్స్‌జెండర్ పల్లవి అలియాస్ రవి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. భర్తగా ఉండాల్సిన వ్యక్తిని చిత్రహింసలకు గురిచేశాను అని వస్తున్న ఆరోపణలపై తనకు సంబంధం లేదని పల్లవి చెప్పినట్లు తెలిసింది. తాము ఇద్దరం కలిసి జీవితాంతం తోడుగా ఉండాలనుకున్నామని, వారిక కుటుంబసభ్యులు నిరాకరించినట్లు విచారణలో వెల్లడైంది. మృతుడి నవీన్ శరీరంపై ఏర్పడిన గాయాలపై తనకు స్పష్టత లేదని చెప్పినట్లు తెలుస్తుంది. ఇరువురి కాల్ డేటాను సైతం పోలీసులు ఆరా తీస్తున్నారు. యువకుడు పురుగుల మందు తాగాడా? లేక ఎవరైనా చిత్రహింసలకు గురిచేశారా? అన్నది విచారణలో తెలియాల్సి ఉంది. మరోవైపు యువకుడు కుటుంబసభ్యులు మాత్రం ట్రాన్స్‌జెండర్, అతని సోదరుడిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో వివరాలు వెల్లడిస్తాం



నవీన్ మృతిపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. ట్రాన్స్‌జెండర్, అతడి సోదరుడిని విచారిస్తున్నాం. విచారణలో వారు ఇద్దరు పెళ్లి చేసుకున్నట్లు వెల్లడైంది. నవీన్ మృతి ఘటనపై దర్యాప్తు వేగవంతం చేశాం. అతడిది హత్యా? లేక ఆత్మహత్యా? అన్న కోణంలో ఆరాతీస్తున్నాం. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం.

- శ్రీను, సీఐ, గద్వాల

ఎమ్మెల్యేను కలిసిన బాధిత కుటుంబం

గద్వాలలోని చింతల్‌పేటకాలనీకి చెందిన నవీన్ మృతిపై సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలంటూ శనివారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డిని బాధిత కుటుంబం కలిసింది. గతేడాది తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఇంతలోనే కుమారుడు బలవన్మరణంకు పాల్పడినట్లు మృతుడి తల్లి తన బాధను చెప్పుకొని కన్నీటి పర్యంతమైంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణకు ఉన్నతాధికారుల దృష్టికెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

సర్వే పనులను అడ్డుకున్న రైతులు

• వెనుదిరిగిన అధికారులు

మక్తల్: మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద సాగునీరు అందించేందుకు మక్తల్ మండలం భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీళ్లను అక్కడి తీసుకెళ్లడం కోసం పనులు చేపట్టేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించారు. శనివారం మండలంలని కాట్రేవ్‌పల్లి గ్రామ రైతులు ఈ సర్వేను అడ్డుకున్నారు. కాట్రెవ్‌పల్లి, యర్నాగన్‌పల్లి గ్రామాల్లో సర్వే పనులు చేస్తుండంతో రైతులు అడ్డుకొని తమకున్న భూమి పోతే ఎలా జీవించాలని అధికారులను ప్రశ్నించారు. తమ భూములకు బదులు భూములు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని అధికారులు తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు సమాచారమివ్వగా ఆ యన అక్కడికి చేరుకొన్నారు. సమస్యను ఆర్డీఓ రాంచందర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేస్తామన్నారు. రైతులు సర్వే పనులను అడ్డుకోవడంతో చేసేదేమీ లేక అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో డీఈ సతీష్‌కుమార్, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఆర్ఐ భూపాల్‌రెడ్డి, తాను, రాజన్న, అరుణ పాల్గొన్నారు.



కాట్రెవ్‌పల్లి శివారులో సర్వే పనులను అడ్డుకున్న రైతులు

దామరగిద్ద తండా రైతుల నిరసన..

దామరగిద్ద: నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా పంట పొలాల్లో రోడ్డు నిర్మాణం చేశారని.. అధికారులు నష్టపరిహారం చెల్లించాలంటూ దామరగిద్దతండా రైతులు శనివారం బాబునాయక్ సమక్షంలో పనులు అడ్డుకొని నిరసన తెలిపారు. వీరికి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుభాష్, సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నారాయణపేట మండలం పేరపళ్లలోని జాయమ్మ చెరువు నుంచి తండా మీదుగా ఎత్తిపోతల పైప్‌లైన్ పనుల్లో భాగంగా పొలాల్లో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని వివరించారు. రైతుల అనుమతి లేకుండా, పరిహారం ఇవ్వకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడంతో 80 మంది గిరిజన కుటుంబాలు భూమిని కోల్పోతున్నాయని వాపోయారు. అభివృద్ధి పేరుతో గిరిజన రైతులకు అన్యాయం చేయడం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు పరిహారం అందించి పనులు చేపట్టాలని కోరారు. బాపనపల్లి, దామరగిద్దతండా రైతులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు